క్లుప్తంగా

నూతన పంచాయతీ ఏర్పాటుకు తీర్మానం

పర్వతగిరి : మండలంలోని ఉట్టితండా, హట్యతండా, బోటికాడితండా కలిపి నూతన గ్రామ పంచాయతీ ఏర్పాటు చేసేందుకు తీర్మానించినట్లు ఎంపీడీఓ శంకర్‌నాయక్, ఎంపీఓ పాక శ్రీనివాస్ తెలిపారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు ఆదేశాల మేరకు ఏబీ తండాలో గురువారం నిర్వహించిన గ్రామసభలో ఈ మేరకు తీర్మానం చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ, ఎంపీఓ మాట్లాడారు. ప్రజల అభ్యర్థన మేరకు ఇప్పటివరకు ఏబీ తండా పరిధిలో ఉన్న ఉట్టితండా, హట్యతండా, బోటికాడితండాలకు వేరుగా గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేసేందుకు తీర్మానం చేసిన క్రమంలో ఉన్నతాధికారులకు నివేదిక అందించనున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

వర్ధన్నపేట : రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైన ఘటన మండలంలోని ఇల్లంద శివారులో గురువారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. ఐనవోలుకు చెందిన కల్లెం రవీందర్, రజిత ఇల్లందకు నుంచి ఆటోలో వెళ్తుండగా ఇసుక లోడుతో ఇల్లంద వైపు నుంచి వస్తున్న ట్రాక్టర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న కల్లెం రవీందర్, రజితలకు గాయాలయ్యాయి. స్థానిక ఎస్సై ప్రవీణ్‌కుమార్ ఘటనా స్థలికి చేరుకుని క్షతగాత్రులను 108లో వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

విద్యుదాఘాతంతో పాడి ఆవు మృతి



దుగ్గొండి : విద్యుదాఘాతానికి గురై పాడి ఆవు మృతి చెందిన ఘటన మండలంలోని తిమ్మంపేటలో గురువారం చోటు చేసుకుంది. వివరాలిలా.. గ్రామానికి చెందిన బైరపాక సాంబయ్య అతడి పాడి ఆవును మేపేందుకు పొలానికి తీసుకెళ్లాడు. ఆవు మేత మేస్తుండగా సాంబయ్య వ్యవసాయ పనులు చేసుకుంటున్న క్రమంలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఉన్న సపోర్ట్ తీగకు తాకి ఆవు విద్యుదాఘాతానికి గురైంది. అక్కడిక్కడే మృతి చెందింది. ఆవు విలువ రూ.50 వేలు ఉంటుందని రైతు సాంబయ్య కన్నీరు మున్నీరయ్యాడు. ప్రభుత్వం తనకు ఆర్థికసాయం అందించి ఆదుకోవాలని సాంబయ్య కోరుతున్నాడు.

అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లిన లారీ

రాయపర్తి : అదుపుతప్పిన ఓ లారీ వరిపొలాల్లోకి దూసుకెళ్లిన ఘటన మండలంలోని మైలారం శివారులో గురువారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. మధ్యప్రదేశ్‌కు చెందిన లారీ ఖమ్మం నుంచి మధ్యప్రదేశ్‌కు వెళ్తుండగా మైలారం శివారులో అదుపు తప్పి పొలాల్లోకి దూసుకెళ్లింది. డ్రైవర్ ధీర రామ్‌పాల్ క్యాబిన్‌లో ఇరుక్కుపోగా గ్రామస్తులు 108కు సమాచారం అందించారు. డ్రైవర్‌ను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

పరామర్శ



గీసుకొండ : మండల కేంద్రానికి చెందిన పాత్రికేయుడు మేకల దాసు, చాపర్తి సాంబయ్య ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాలకు పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి గురువారం పరామర్శించారు. అలాగే స్టేట్ బ్యాంక్ రిటైర్డ్ మేనేజర్ పెగళ్లపాటి లక్ష్మీనారాయణ పంపించిన రూ.5 వేల చొప్పున నగదును గ్రామానికి చెందిన కర్ణకంటి రామ్మూర్తి, తదితరులు దాసు, సాంబయ్య కుటుంబాలకు అందజేశారు.

బీఆర్‌ఎస్ నాయకుడికి..

చెన్నారావుపేట : మండల కేంద్రానికి చెందిన బీఆర్‌ఎస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కందకట్ల సాంబయ్యని అతడి తండ్రి భిక్షపతి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన సందర్భంగా మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి పరామర్శించారు. తొలుత భిక్షపతి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పరామర్శించిన వారిలో మాజీ జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు మహ్మద్ రఫీ, బీఆర్‌ఎస్ యూత్ మండల ఇన్‌చార్జ్ కంది కృష్ణ చైతన్యరెడ్డి, యూత్ అధ్యక్షుడు మూడు రమేశ్, పార్టీ మండల ఉపాధ్యక్షుడు కుసుమ నరేందర్, నాయకులు జున్నూతుల మహేందర్‌రెడ్డి, కుమారస్వామి, నర్మెట్ట సాంబయ్య, తదితరులున్నారు.

మండల కేంద్రంలో..

నెక్కొండ : బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు కొమ్మారెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి పరామర్శించారు. తొలుత చంద్రశేఖర్‌రెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పించారు. అనంతరం మాట్లాడారు. బాధిత కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ మారం రాము, పార్టీ మండల అధ్యక్షుడు సంగని సూరయ్య, నాయకులు కొమ్ము రమేశ్‌యాదవ్, కొమ్మారెడ్డి రవీందర్‌రెడ్డి, సాంబయ్య, మహ్మద్ ఖలీల్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు



మహిళా సంఘాలకు చెక్కులు పంపిణీ చేస్తున్న మంత్రులు

నర్సంపేట రూరల్ : నర్సంపేట సర్వాపురం శివారులోని వైద్యకళాశాల, జిల్లా ఆస్పత్రి ప్రారంభోత్సవానికి గురువారం వచ్చిన మంత్రులు దామోదర రాజనర్సింహ, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖలకు అధికారులు, ప్రజాప్రతినిధులు, వేద పండితులు ఘనస్వాగతం పలికారు. ప్రత్యేక హెలికాప్టర్‌లో మంత్రులు వైద్యకళాశాల, జిల్లా ఆస్పత్రికి చేరుకున్నారు. ఆస్పత్రిలో పలు విభాగాలను పరిశీలించారు. ఆస్పత్రి, వైద్యకళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం వైద్యకళాశాల భవనాన్ని ప్రారంభించారు. జిల్లా ఆస్పత్రి భవనాలను అప్పగిస్తూ కళాశాల ప్రిన్సిపాల్ మోహన్‌దాస్, సూపరింటెండెంట్ కిషన్‌లకు పత్రాలు అందజేశారు. అనంతరం కళాశాలలోని ఇందిరా మహిళా క్యాంటీన్‌ను పరిశీలించారు. వంటకాలను రుచి చేశారు. 15 మహిళా సంఘాలకు రూ.2 కోట్ల విలువైన చెక్కులను మంత్రులు పంపిణీ చేశారు. నర్సంపేటలోని బాలికల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంచినీటి సరఫరా కోసం అమృత్–2 పథకం కింద మంజూరైన రూ.30 కోట్ల నిధులతో చేపట్టిన పైపులైన్ పనులకు,రాజుపేట శివారులో రూ.2 కోట్లతో చేపట్టిన బంజార భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జర్నలిస్టులు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి, తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆశవర్కర్లు, 108 సిబ్బంది మంత్రి దామోదర రాజనర్సింహకు వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమాల్లో మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాంనాయక్, స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, ఎమ్మెల్యేలు రాంచంద్రునాయక్, నాగరాజు, మురళీనాయక్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి, కలెక్టర్ సత్యశారద, డీఎంహెచ్‌ఓ వాణి పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నాయకుల ముందస్తు అరెస్ట్



నల్లబెల్లి : నిరసన తెలుపుతున్న నాయకులు

సాక్షి నెట్‌వర్క్ : నర్సంపేటలో వైద్య కళాశాల, ప్రభుత్వ ఆస్పత్రి ప్రారంభోత్సవాలకు మంత్రులు రానున్న నేపథ్యంలో పోలీసులు నెక్కొండ పీఏసీఎస్ చైర్మన్ మారం రాము, బీఆర్‌ఎస్ నాయకులు ఆలకుంట సురేందర్, మహ్మద్ ఖలీల్, జి.కుమార్, బల్ల వెంకన్న, చీకటి శ్రీనివాస్, ఉపేందర్, మంగిశెట్టి కొమ్మాలు, కోల సారంగం, బైపతి వీరేశ్, నల్లబెల్లి మండలంలో తాజా మాజీ సర్పంచ్‌లు నానబోయిన రాజారాం, గోనె శ్రీదేవి, సిద్దురి రత్నాకర్‌రావు, లావుడ్య తిరుపతి, నూనావత్ వెంకన్న, ఊరటి అమరేందర్, కరివేదుల వెంకట్‌రెడ్డి తదితరులను పోలీసులు అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా అరెస్టైన మాజీ సర్పంచ్‌లు పోలీస్‌స్టేషన్ ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. దుగ్గొండి మండలానికి చెందిన బీఆర్‌ఎస్ మాజీ సర్పంచ్‌లు ఓడేటి తిరుపతిరెడ్డి, మోడెం విద్యాసాగర్, రేవూరి సురేందర్‌రెడ్డి, నీలం పైడయ్య, మొగ్గం మహేందర్‌లను, ఖానాపురం మండలంలో మాజీ సర్పంచ్‌లు భూస రమ అశోక్, గుగులోతు సుమన్, వెంకన్న, హత్యా, అశోక్, గొర్రె రవి, తదితరులను పోలీసులు అరెస్ట్ చేశారు. వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశారు.

సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ కొనసాగించాలి

నర్సంపేట రూరల్ : కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్) రద్దు చేసి ఓల్డ్ పెన్షన్ స్కీమ్ (ఓపీఎస్) కొనసాగించాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఈదునూరి రవీందర్ డిమాండ్ చేశారు. నర్సంపేటలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సెకండరీ స్థాయిలో సీపీ పరీక్షా విధానాన్ని తొలగించి పాత పరీక్షా విధానాన్ని ప్రవేశపెట్టాలని, పెండింగ్‌లో ఉన్న డీఏలు మంజూరు చేయాలని, నూతన పీఆర్‌సీతోపాటు 50 శాతం ఫిట్‌మెంట్ ప్రకటించాలని, పెండింగ్ బిల్లులు చెల్లించాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని తీర్మానించినట్లు తెలిపారు.

మండల కమిటీ ఎన్నిక





సాంబయ్య మల్లయ్య

పీఆర్‌టీయూ నర్సంపేట మండల కమిటి ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కోడెం సాంబయ్య, ప్రధాన కార్యదర్శిగా శీలం మల్లయ్య ఏకగ్రీవంగా ఎన్నిక చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మహ్మద్ అబ్దుల్ గఫార్, మాజీ జిల్లా అధ్యక్షుడు శానబోయిన ఉమామహేశ్వర్, పంచాయతీ రాజ్ మాసపత్రిక సంపాదక సభ్యుడు వెంకటరామరాజు పాల్గొన్నారు.

బాలల శారీరక అభివృద్ధికి ప్రాధాన్యం



సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీఓ డెబోరా

రాయపర్తి : బాలల శారీరక అభివృద్ధికి ప్రాధాన్యమిస్తున్నట్లు ఐసీడీఎస్ వర్ధన్నపేట సీడీపీఓ డెబోరా తెలిపారు. మండలంలోని కాట్రపల్లిలోని అంగన్‌వాడీ సెంటర్‌లో గురువారం నిర్వహించిన పోషణ అభియాన్ కార్యక్రమానికి ఆమె అతిథిగా హాజరై మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో బరువు తక్కువగా ఉన్న పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించి బాలామృతంతోపాటు మందులు అందిస్తున్నట్లు తెలిపారు. సమాజంలో ప్రజల ఆహార అలవాట్లలో మార్పు తీసుకొచ్చే దిశగా ఏటా సెప్టెంబర్ 1 నుంచి 30వ తేదీ వరకు పోషణ అభియాన్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం అంగన్‌వాడీ సెంటర్ల ద్వారా అందిస్తున్న పోషకాహారాన్ని వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ శ్రీప్రియ, కార్యదర్శి రాజేందర్, పల్లె వైద్యుడు మహేశ్, హెచ్‌ఎంలు యూన్సీరాణి, స్వర్ణ, సూపర్‌వైజర్లు విజయలక్ష్మి, మాధవీలత, లలిత, చంద్రకళ, బ్లాక్ కోఆర్డినేటర్ అనిత, అంగన్‌వాడీ టీచర్లు సాహెబున్నీసా, యాకూబీ, రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు మెరుగైన వైద్యం అందించాలి



వర్ధన్నపేట : ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే పేద రోగులకు మెరుగైన సేవలు అందించాలని ధర్మసమాజ్ పార్టీ (డీఎస్పీ) ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ మేకల సుమన్ కోరారు. ఆ పార్టీ నాయకుల బృందం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిని గురువారం సందర్శించింది. ఈ సందర్భంగా సౌకర్యాలు, ఇతర సమస్యలపై రోగులను నాయకులు అడిగి తెలుసుకున్నారు. అనంతరం సుమన్ మాట్లాడారు. వైద్యులు నిరంతరం అందుబాటులో ఉండి సేవలు అందించాలన్నారు. ప్రజలు ఆస్పత్రిని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కేడల ప్రసాద్, మురళీకృష్ణ, వెంకటస్వామి, అశోక్, ప్రదీప్, పూరెళ్ల విష్ణు తదితరులు పాల్గొన్నారు.

మహ్మద్ ప్రవక్త జీవితం స్ఫూర్తిదాయకం



ర్యాలీలో ముస్లిం బాలలు, మత పెద్దలు

నర్సంపేట : మహ్మద్ ప్రవక్త జీవితం స్ఫూర్తిదాయకమని ముస్లిం మత పెద్దలు మౌలానా షాహిద్ రజా, మౌలానా రియ్యాస్ రజా అన్నారు. జష్నె ఈద్ మిలాద్ ఉన్ నబీ సల్లల్లాహు అలైహి వసల్లం సందర్భంగా పట్టణంలోని మల్లంపల్లి రోడ్డులోని జమాలే బహార్ దర్గా నుంచి అంబేడ్కర్ సెంటర్, వరంగల్ రోడ్డు మీదుగా జమాలే బహార్ దర్గా వరకు గురువారం ర్యాలీ నిర్వహించారు. ముస్లిం బాలలు, మత పెద్దలు పండ్లు, పానియాలు ప్రజలకు పంచిపెట్టారు. అనంతరం దర్గా వద్ద బయాన్ ప్రోగ్రాం నిర్వహించి అన్నదానం చేశారు. ఈ సందర్భంగా షాహిద్, రియ్యాస్ మాట్లాడారు. మహ్మద్ ప్రవక్త నడిచిన శాంతి మార్గంలో పయనిస్తూ సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మహ్మద్ రియాజుద్దీన్, మహ్మద్ అహ్మద్, షేక్ రశీద్, యాకూబ్, హాజీ పాషా, బుడెన్, హఫీజ్, ఖలీల్, జలీల్, అఖిల్, సర్దార్, జాహెద్, మహబూబ్, సాధిక్, ఖాదర్, సోనూ, మున్నా, అఫ్రోజ్, ఇమ్రాన్, తాజ్, రఫీ, సర్వర్, షారుఖ్, ఖాజా, రయ్యాన్, తదితరులు పాల్గొన్నారు.

నివాళి

చెన్నారావుపేట : మండలంలోని అక్కల్‌చెడ గ్రామ శివారు కట్టయ్యపల్లికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రాధారపు పుల్లారెడ్డి మనుమడు రాహుల్‌రెడ్డి అనారోగ్యంతో బాధపడుతూ పరిస్థితి విషమించి గురువారం మృతి చెందగా మృతదేహంపై ఆ పార్టీ మండల అధ్యక్షుడు భూక్య గోపాల్ నాయక్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకుడు కంది కృష్ణారెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షుడు పులిశేరు రాజేందర్, మాజీ సర్పంచ్ తూటి పావని రమేశ్, నాయకులు మంకు కరుణాకర్‌రెడ్డి, ముత్యం భద్రయ్య, మేకల నర్సయ్య, శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బాలికల సంరక్షణ సామాజిక బాధ్యత



సదస్సులో మాట్లాడుతున్న ఇందిర

సంగెం : బాలికల సంరక్షణను సామాజిక బాధ్యతగా సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ ట్రెయినింగ్ కోఆర్డినేటర్ ఇందిర అభివర్ణించారు. ఆ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని విద్యాభారతి హైస్కూల్‌లో 'లింగ ఆధారిత హింస, లింగ సున్నితత్వం'పై బాలికలకు గురువారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. బాలికల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని అవసరాలు తీర్చాలని, హక్కులు కల్పించాలని చెప్పారు. యుక్తవయస్సులో బాలికలు విద్య, బంగారు భవిష్యత్‌పై దృష్టి సారించి ఉన్నత స్థితికి చేరుకోవాలని తెలిపారు. బాలల పరిరక్షణ కమిటీలు ఏర్పాటు చేసి హక్కులకు భంగం కలుగకుండా, సహాయ వ్యవస్థలపై అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో సంస్థ ఉద్యోగి వాణి, స్కూల్ కరస్పాండెంట్ చందర్‌రావు, ప్రిన్సిపాల్ మధూకర్, ఉపాధ్యాయులు ఉష, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

పోక్సో కేసు నమోదు

ఐనవోలు : మండలంలోని ఓ వ్యక్తిపై పోక్సో కేసు నమోదు నమోదు చేసినట్లు ఎస్సై పస్తం శ్రీనివాస్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పున్నేలు గ్రామ పరిధిలోని వడ్డెరగూడెం గ్రామానికి చెందిన ఆలకుంట్ల మధు అదే గ్రామానికి చెందిన ఓ బాలికపై అత్యాచారానికి పాల్పడినట్లు బాధితురాలి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతు



ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతు చేస్తున్న సిబ్బంది

పర్వతగిరి : మండలంలోని చౌటపల్లిలోని పొలాల వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పాడైపోగా వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు ఆదేశాల మేరకు సిబ్బంది గురువారం మరమ్మతు చేసి సర్వీసు పునరుద్ధరించారు. సమస్యల పరిష్కారం కోసం తన వద్దకు రావాల్సిన అవసరం లేకుండా తన సెల్ నంబర్ 8096107107కు ప్రతిరోజూ ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రజలు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని ఎమ్మెల్యే కొద్ది రోజుల క్రితం ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పాడైపోగా రైతులు, కాంగ్రెస్ శ్రేణులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఆయన సత్వరమే స్పందించారు. గంటల వ్యవధిలోనే మరమ్మతు చేయించారు. ఈ నేపథ్యంలో చౌటపల్లి రైతులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఎమ్మెల్యే నాగరాజుకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రమాదకరంగా బీటీ రోడ్డు



చెన్నారావుపేట: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలంలోని చెరువుకొమ్ము తండా శివారులోని వాల్యతండా బీటీ రోడ్డు కోతకు గురై ప్రమాదకరంగా ఉంది. దీంతో తండాకు చెందిన పలువురు రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని బుధవారం రోడ్డును పరిశీలించి అధికారులను కోరారు. రోడ్డుగుండా ప్రయాణం చేయడానికి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎదురుగా వచ్చే వాహనాలను తప్పించాలంటే ప్రయాణం కష్టంగా మారిందన్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి కోతకు గురైన రోడ్డుకు మరమ్మతు పనులు చేపట్టాలని మాజీ ఎంపీటీసీ భూక్య రమాబాయి, మైబు సింగ్‌రాథోడ్, తండావాసులు కోరుతున్నారు.

జాతీయోద్యమంలో హిందీ కీలకం



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న శ్రీధర్

ఖానాపురం : భారత జాతీయోద్యమంలో ప్రజలను జాగృతం చేసి ఏకతాటిపై నడిపే దిశగా హిందీ భాష కీలకంగా నిలిచిందని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి శ్రీధర్ సుమన్ తెలిపారు. హిందీ భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో హిందీ పఖ్వాడ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. విద్యార్థులకు పలు క్రీడాపోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం శ్రీధర్ సుమన్ మాట్లాడారు. భారతదేశంలో సుమారు 80 శాతం ప్రజలు హిందీ మాట్లాడడంతోపాటు అర్థం చేసుకుంటారని చెప్పారు. హిందీ నేర్చుకుంటే కేంద్ర, రాష్ట్ర ఉద్యోగాలు పొందవచ్చని తెలిపారు. హిందీకి మల్టీనేషనల్ కంపెనీలు అదనపు అర్హతగా ప్రాధాన్యత కల్పిస్తున్నాయని వివరించారు. ఆస్ట్రేలియా, అమెరికా, తదితర దేశాల్లోని ప్రవాస భారతీయులు పిల్లలకు హిందీ తప్పకుండా నేర్పిస్తున్నారని తెలిపారు. అనంతరం హిందీ అధ్యాపకులను సత్కరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ సదానందం, లైబ్రేరియన్ సుధీర్ కుమార్, ఎన్‌ఎస్‌ఎస్ పీఓ పరాచికపు సదానందం, అధ్యాపకులు విజయ్‌కుమార్, రవికుమార్, తిరుపతమ్మ, సంజీవ, రాజేశ్, కృష్ణమూర్తి, సంతోశ్, దేవేందర్, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితాలో పారదర్శకతే ధ్యేయం



వర్ధన్నపేట : మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి

సాక్షి నెట్‌వర్క్ : ఓటరు జాబితాను పారదర్శంగా రూపొందించడమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నట్లు వర్ధన్నపేట ప్రత్యేక అధికారి వెంకటేశ్వర్లు, ఎంపీడీఓలు వెంకటరమణ, రవీందర్, గుగులోతు కిషన్‌నాయక్, కమలాకర్, అరుంధతి, శంకర్ నాయక్ తెలిపారు. వర్ధన్నపేట, సంగెం, రాయపర్తి, గీసుకొండ, దుగ్గొండి, పర్వతగిరి మండల పరిషత్ కార్యాలయాల్లో అఖిలపక్ష నాయకులతో గురువారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. రాజకీయ పార్టీల ప్రతినిధులకు అవగాహన కల్పించారు. గ్రామ పంచాయతీ రెండో సాధారణ ఎన్నికల ముసాయిదా జాబితాను రూపొందించినట్లు చెప్పారు. వార్డుల వారీగా తయారు చేసిన జాబితాల్లో ఒకే కుటుంబానికి చెందిన వ్యక్తులు ఒకే వార్డులో ఉండాలన్న రాజకీయ పార్టీల ప్రతినిధుల అభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకున్నట్లు తెలిపారు. ఏమైనా అభ్యంతరాలు ఉంటే 21వ తేదీలోగా లిఖిత పూర్వకంగా తెలియజేయాలని సూచించారు. ఈనెల 13 నుంచి 21 వరకు జాబితాలపై అభ్యంతరాలు స్వీకరించి 28న తుది జాబితా రూపొందిస్తామని తెలిపారు. అభ్యంతరాలు, తప్పొప్పులు ఉంటే సవరిస్తామని భరోసా ఇచ్చారు. సమావేశాల్లో రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దాలి



ఖానాపురం : మాట్లాడుతున్న ఏఎంఓ సృజన్‌తేజ



రాయపర్తి : మాట్లాడుతున్న కృష్ణమూర్తి

● జిల్లా ఏఎంఓ సృజన్ తేజ

ఖానాపురం/దుగ్గొండి/నల్లబెల్లి/చెన్నారావుపేట: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులను ఆదర్శంగా తీర్చిదిద్దాలని జిల్లా అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ (ఏఎంఓ) సృజన్‌తేజ సూచించారు. ఖానాపురం, దుగ్గొండి, నల్లబెల్లి, చెన్నారావుపేట మండలాల్లో గురువారం జరిగిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశాల్లో ఆయన మాట్లాడారు. విద్యార్థులకు ప్రాథమిక స్థాయిలోనే చదవడం, రాయడం నేర్పించాలని పేర్కొన్నారు. విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివి లక్ష్యాన్ని చేరుకోవాలని చెప్పారు. ఖానాపురంలో జరిగిన సమావేశంలో ఎంఎన్‌ఓ చరణ్‌సింగ్, కాంప్లెక్స్ హెచ్‌ఎం హుస్సేన్, సీఆర్పీలు రమేశ్, భాస్కర్, వీరస్వామి, ఉపాధ్యాయులు, దుగ్గొండిలో జరిగిన సమావేశంలో హెచ్‌ఎంలు ఎలగొండ రామస్వామి, రావుల దేవేందర్, జ్యోతిలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. నల్లబెల్లిలో జరిగిన సమావేశంలో ఏవీఆర్ ఆచార్యులు, ఉపాధ్యాయులు శ్రీమాత, శృతి, సీఆర్పీ శనిగరం రాజేందర్, చెన్నారావుపేటలో జరిగిన సమావేశంలో మండల నోడల్ ఆఫీసర్ సరళ, కాంప్లెక్స్ హెచ్‌ఎంలు పాపమ్మ, ప్రభాకర్‌రావు, న్యాస్ నిపుణులు చారి, ఆర్పీలు కిరణ్, రవి, సత్యనారాయణ, హెచ్‌ఎంలు రవీందర్‌రెడ్డి, సూరయ్య, సురేందర్, కట్టస్వామి, నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్థమయ్యేలా బోధించాలి

రాయపర్తి : విద్యార్థుల విద్యాభివృద్ధికి ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు కృషి చేయాలని డీసీఈబీ సెక్రటరీ గారె కృష్ణమూర్తి సూచించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మట్లాడారు. ప్రాథమిక స్థాయిలో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పెంచాలని సూచించారు, సులభతరంగా అర్థమయ్యేలా బోధన చేయాలన్నారు. చదువు వైపు మళ్లించే విధంగా విద్యార్థులను ప్రోత్సహించాలన్నారు. సమావేశంలో నోడల్ అధికారి వి.శ్రీనివాస్, ఆర్పీలు రజినీకాంత్, వెంకటేశ్వర్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటరమణ, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సీఆర్పీలు బి.రమేశ్, వెంకన్న, ఎల్లాగౌడ్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఏఎస్ పరీక్షకు సిద్ధం చేయండి

పర్వతగిరి : విద్యార్థులను నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే (ఎన్‌ఏఎస్) పరీక్షకు సిద్ధం చేయాలని కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు పాక రమేష్‌బాబు కోరారు. మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన పర్వతగిరి, సంగెం మండలాల తెలుగు భాషా ఉపాధ్యాయుల అప్పర్ ప్రైమరీ స్కూల్ కాంప్లెక్స్ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ఉపాధ్యాయులు లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాంను ఖచ్చితంగా అమలు చేయాలని చెప్పారు. విద్యార్థుల ఉన్నతే లక్ష్యంగా ప్రభుత్వం, విద్యాశాఖ చేపట్టిన కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. విద్యార్థులు అన్ని పరీక్షల్లోనూ మెరుగైన ఫలితాలు సాధించేలా, ఎలాంటి ఒత్తిడి లేకుండా అభ్యసించేలా కృషి చేయాలని సూచించారు. సమావేశంలో రిసోర్స్‌పర్సన్ డాక్టర్ మడత భాస్కర్, సీఆర్పీలు పి.ప్రవీణ్, శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శుభ్రతతో ఆరోగ్య పరిరక్షణ



రోగులకు పరీక్షలు చేస్తున్న డాక్టర్ హుస్సేన్, సిబ్బంది

దుగ్గొండి : వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించడం ద్వారా ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చని డాక్టర్ హుస్సేన్ తెలిపారు. మండలంలోని పానకల్‌లో గురువారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరంలో 160 మందికి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. 6 గురికి రక్త పరీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ హుస్సేన్ మాట్లాడారు. వర్షాకాలంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. అపరిశుభ్ర వాతావరణంతో దోమల ప్రబలి ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారని చెప్పారు. సమాజంలోని ప్రతిఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, కాచి చల్లార్చిన నేటినే తాగాలని, అనారోగ్యం తలెత్తితే వెంటనే వైద్యులను సంప్రదించాలని, తదితర సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు పుచ్చ లలిత, మండల అనిత, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.